క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న తిరుపతిరావు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం సచివాలయంలో సోమవారం లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేపట్టారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ క్లోపల్లి తిరుపతిరావు పింఛన్ల మొత్తాన్ని అందజేశారు. సచివాలయం యూనిట్‌గా అర్హులందరికీ పింఛన్ అందజేస్తామన్నారు. సచివాల ఉద్యోగులు, గ్రామలలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: యువతే దేశ భవితకు దిక్సూచి అని చిలకపాలెంలోని శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ యువజనోత్సవాలు సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వామివివేకానంద చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ప్రసాద్, ఎన్‌వైకే వలంటీర్లు రవీంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

16 మందికి ప్లేస్‌మెంట్



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య సభ్యులు

ఎచ్చెర్ల కాంపస్: ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విశాఖపట్నానికి చెందిన విశ్వనాథ ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సివిల్ ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులు 55 మంది హాజరు కాగా..16 మంది ఎంపికయ్యారు. గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ట్రైనీలుగా వీరికి ఉద్యోగ నియమాక పత్రాలు అందజేశారు. మూడు నెలల ఇంటర్న్‌షిప్ అనంతరం వీరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరాంమూర్తి, ప్రిన్సిపాల్ ఎస్‌వీ రమణమూర్తి విద్యార్థులను అభినందించారు.

టోల్‌గేట్ కార్మికుల నిరసన

శ్రీకాకుళం పాతబస్టాండ్: తమను ప్రభుత్వం ఆదుకోవాలని చిలకపాలెం టోల్‌గేట్‌లో పనిచేసిన కార్మికులు కోరారు. టోల్‌గేట్ మూసివేయడంతో తాము రోడ్డున పడ్డామన్నారు. న్యాయం చేయాలని కోరుతూ సీఐటీయూ నేతృత్వంలో జిల్లా పరిషత్ స్పందన విభాగం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. తమకు మరోచోట ఉపాధి కల్పించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎస్.వి.రమణ, డి.వి.నర్సింహులు ఉన్నారు.

వీఏఏల రక్తదానం



వీఏఏలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రైతు సేవలోనేకాక సమాజ సేవలో కూడా మేముసైతం అని రణస్థలం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ గ్రామీణ వ్యవసాయ అసిస్టెంట్లు రవితేజ, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, సుగుణారక్‌లు నిరూపించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం సోమవారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రణస్థలం ఏడీఏ వడ్డాది శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమాజం పట్ల తమ బాధ్యతను వీఏఏల రూపంలో తీర్చినందుకు గర్వంగా ఉందన్నారు. శ్రీకాకుళంలోని జేసీఎల్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి గుర్తింపు తెచ్చారన్నారు. వీరిని అభినందిస్తూ జేసీఎల్ తరఫున సర్టిఫికెట్లు అందజేశారు.

మండల బడ్జెట్ ఆమోదం

లావేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల పరిషత్ బడ్జెట్ సమావేశం జరిగింది. సూపరింటెండెంట్ సునీత బడ్జెట్ వివరాలను వివరించగా సభ్యులు ఆమోదించారు. 66,14,470 రూపాయలను అంచనాగా చూపించగా.. రూ. 60,02,721 వ్యయం, రూ.6,11,749 మిగులుగా చూపించారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ఎల్.శ్రీనివాసరావు, ఎ.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

- గార్బేజ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి
- మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్:

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. తండేవలస గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డులో రూ. 18.76 కోట్ల వ్యయంతో చేపట్టిన గార్బేజ్ మేనేజ్‌మెంట్ ప్రోసెస్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డులో చెత్తను బయో రేడియేషన్, బయోమైనింగ్ ప్రాసెసింగ్ చేస్తామన్నారు. దీనివలన చెత్తను పునర్వినియోగ ప్రక్రియకు వినియోగించేందుకు వీలవుతోందని చెప్పారు. గతంలో గార్బేజ్ యార్డు లేని కారణంగా ఆమదాలవలస– శ్రీకాకుళం రోడ్‌పై చెత్త వేసేవారన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు 27 ఎకరాల్లో డంపింగ్‌యార్డును నెలకొల్పినట్లు పేర్కొన్నారు. ఇక్కడ డంపింగ్ యార్డు ప్రారంభించి 15 ఏళ్లు గడిచిందని చెప్పారు. తొలి రోజుల్లో ఇక్కడ ఉన్న చుట్టూ పక్కల ప్రజలు వ్యతిరేకించారన్నారు. ఇన్నాళ్లు భరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. దేశంలో పెద్ద ఎత్తున కేంద్ర సహకారంతో మనం గార్బేజ్ మేనేజ్‌మెంట్ చేస్తున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా తడి, పోడి చెత్త విధానాన్ని అమలు చేసినట్లు వివరించారు. ప్రతి వార్డులో వార్డు సెక్రటరీ, మున్సిపల్ సిబ్బందిని పర్యవేక్షకులుగా నియమించామన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, సర్పంచ్‌లు ఆదిత్య, కూర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చలా శ్రీనివాసరావు, ముకళ్ల తాతబాబు, నక్క రామరాజు, కేఎల్ ప్రసాద్, అల్లు లక్ష్మీనారాయణ, గెంజి వాసు తదితరులు పాల్గొన్నారు.

సప్తమి ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

అరసవల్లి: అరసవల్లిలో జరగనున్న రథసప్తమి ఉత్సవానికి సంబంధించి జరుగుతున్న పనులను జిల్లా దేవదాయశాఖాధికారి డి.వి.వి.ప్రసాదరావు సోమవారం మధ్యాహ్నం పరిశీలించారు. సాధారణ భక్తుల కోసం నిర్మిస్తున్న కొత్త క్యూకాంప్లెక్స్, పెయింటింగ్ పనులు, క్యూలైన్ కంపార్టుమెంట్లుతో పాటు వీఐపీల రాకపోకల మార్గాలను పరిశీలించారు. అలాగే టూరిజం భవనానికి వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాలను మార్చేసిన తర్వాత క్యూ కంపార్టుమెంట్లను వేయాలని కాంట్రాక్టర్ ఉంగటి పాపారావుకు సూచించారు. ఇంద్రపుష్కరిణి పరిసరాలన్నీ మరింత పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా ప్రధాన ఆర్చిగేటు నుంచి ఆలయ ప్రధాన ద్వారం వరకు ఉన్న పలువురు వ్యాపారులు ఆలయ అధికారులు, వన్‌టౌన్ ఎస్సై గణేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. దుకాణాలకు ముందు వేసిన రేకుషెడ్లను వెంటనే తొలిగించాలని ఎస్సై గణేష్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు శంకరశర్మ, స్థానిక డివిజన్ ఇన్‌చార్జి గంగు సీతాపతి, ఎస్సై గణేష్ ఉన్నారు.

పింఛన్లు చెల్లించాలని విజ్ఞప్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఉద్యోగులు సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. సకాలంలో పింఛను అందక విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.కరువు భత్యం (డీఏ) బకాయిలు కూడా చెల్లించాలని కోరారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో జిల్లా శాఖ శాఖ అధ్యక్షుడు టి.వీరభద్రస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి పి.నరసింహమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సోమసుందరావు, కోశాధికారి బి.విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులు పి.ఎస్.ప్రసాదరావు, సవరయ్య ఉన్నారు.

పెండింగ్ చలానాల వసూలు



చలానాలు కట్టిస్తున్న ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: వాహనాలకు సంబంధించి పెండింగ్ చలానాలను వసూలు చేస్తున్నట్టు ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఎస్పీ కార్యాలయం సమీపం ఆర్టీసీ కాంప్లెక్సు దరిలో సోమవారం వివిధ వాహనాలను తనిఖీ చేసి.. పెండింగ్‌లో ఉన్న చాలానాలను కట్టించామన్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక, ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌వీవీ ప్రసాదరావుల ఆదేశాల మేరకు పది రోజులుగా పట్టణంలోని అన్ని ముఖ్య కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. సోమవారం ఒక్కరోజే 168 వాహనాలకు ఫైన్ వేసి రూ. 38,760 రికవరీ చేశామన్నారు. 'సాక్షి'లో ప్రచురితమైన పండగ వేళ.. ట్రాఫిక్ గోల కథనానికి సంబంధించి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆపి సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కాంప్లెక్సుకు ఎదురుగా ఎక్కువ సేపు బస్సులు నిలువకుండా చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: రోడ్డు ప్రమాదాలపై వాహన చోదకులు అప్రత్తంగా ఉండాలని ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. అల్లినగరం కూడలిలో వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. నిద్ర మత్తు, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతుంటాయని.. అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. గత ప్రమాదాల తీరును పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఫలితాలు



పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రీసోర్సుపర్సన్ లక్ష్మన్నాయుడు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో సోమవారం ప్రకృతి వ్యవసాయ సాగుపై పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల సాగుపట్ల పూర్తి అవగాహనతో ముందుకు సాగాలన్నారు. ప్రధానంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. భూసారం కోసం ద్రవ, ఘన జీవామృతాలు, తెగుళ్ల నియంత్రణకు కషాయాలు వినియోగించాలన్నారు. రైతులు అంతర, ఉద్యాన పంటల సాగుకు ముందుకు రావాలన్నారు.

'శ్రీకూర్మనాథాలయం అద్భుతం'



పూజల్లో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి

గార: శ్రీకూర్మనాథాలయం అద్భుతమైనదని త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి అన్నారు. సోమవారం సాయంత్రం సామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదులతో అధికారులు, అర్చకులు ఎదురేగి స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతపై స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించగా ఈవో జి.గురునాథం, పాలకమండలి సభ్యుడు డబ్బీరు వాసుదేవరావులు స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

ప్రజాపాలకుడు సీఎం జగన్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- లక్ష్మీపురం, దేశిపాలెం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లక్ష్మీపురంలో సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

లావేరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తూ జనరంజక పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఆయనకు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మీపురం, దేశిపాలెం గ్రామాల్లో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి మంజూరైన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి.. సమస్యలు ఏమైనా ఉన్నాయాని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం ఉండాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాలు మంజూరు చేసి వలంటీర్ల ద్వారా అర్హులైన వారికి ఇంటి వద్దకే చేరువ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, మండల ఉపాధ్యక్షుడు గొర్లె సూర్యప్రకాష్, లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొల్లి ఎల్లమ్మ, పార్టీ నాయకులు కొల్లి ఈశ్వరరావురెడ్డి, కాగితాల కృష్ణారెడ్డి, కొల్లి రమణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్ చాన్‌బాషా, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డైరెక్టరు కింతలి రమేష్‌బాబు, బూత్ కమిటీ మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు, ఏవో డి.మహేష్‌నాయుడు, పీఆర్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఎల్.అప్పన్న, కె.అప్పలనాయుడు, బి.శివకుమార్, ఏపీవో ఆర్.సత్యవతి, ఏపీఎం ఎం.మాధవీలత పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడ్ని అరెస్ట్ చేయాలి

శ్రీకాకుళం అర్బన్: గార మండలంలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు చెల్లుబోయిన సూర్యనారాయణను తక్షణమే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఉన్నత లక్ష్యసాధనకు పాటుపడాలి



మాట్లాడుతున్న విజయ్ మణికంఠ

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు ఉన్నత లక్ష్యసాధనకు నిరంతరం పాటుపడాలని సెబ్ జిల్లా అధికారి విజయ్ మణికంఠ (ఐపీఎస్) అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూప్–1, సివిల్ సర్వీసెస్ వంటి పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలో ఉద్యోగాలకు కొదవలేదని.. వాటిని సాధించే విధానం, నైపుణ్యాలు సరిగ్గా లేకపోవడంతో అండర్ ఎంప్లాయిమెంట్‌తో సరిపెట్టుకుంటున్నారన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ పాల్గొన్నారు.

విద్యార్థులు భాగస్వాములు కావాలి

- సెబ్ అసిస్టెంట్ కమిషనర్ కె.పి.గోపాల్



మాట్లాడుతున్న గోపాల్

శ్రీకాకుళం క్రైమ్: మాదక ద్రవ్య రహిత రాష్ట్ర నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అసిస్టెంటు కమిషనర్ కె.పి.గోపాల్ అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సెబ్ జేడీ విజయ నాగమణికంఠ ఆదేశాలతో న్యూకాలనీలోని చైతన్య కళాశాలలో మాదక ద్రవ్యాల వలన కలుగు హాని, జరుగు పరిణామాలు, వాటిపై ఉండే కఠినతరమైన చట్టాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాల జోలికి వెళ్లమని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల క్రయ విక్రయాలు, అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం తెలిస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ టి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ కె.ఉదయలక్ష్మి, డీన్ మురళీధర్, ఏజీఎం పి.నర్సినాయుడు పాల్గొన్నారు.

గృహ సారథుల నియామకంపై సమావేశం

జి.సిగడాం: గృహసారథుల నియామకంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బూరాడ వెంకటరమణ అన్నారు. ఆనందపురం, సంతవురిటి, పాలఖండ్యాం, మెట్టవలస, పెంట, సీతంపేట, నిద్దాం గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో గృహ సారథుల ఎంపికపై సోమవారం సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖసలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పేడాడ శ్రీరామమూర్తి, చిత్తిరి మోహన్ పాల్గొన్నారు.

ఈక్రాప్ తప్పనిసరి

జి.సిగడాం: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసే ప్రతి పంటకు ఈక్రాప్‌ను పక్కాగా నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి యర్ర శారద అన్నారు. జి.సిగడాం రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన వీఏల సమావేశంలో ఆమె మాట్లాడారు. 21 ఆర్‌బీకేల పరిధిలో పూర్తిస్థాయిలో పంటల నమోదు చేయించాలన్నారు. ఏఈఓలు కంబాల జగదీశ్వరరావు ఉన్నారు.

ప్రజా సంకల్పయాత్ర చారిత్రాత్మకం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



రణస్థలం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర దేశ రాజకీయాల్లో ఓ సంచలనం, చారిత్రాత్మకమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ప్రజా సంకల్పయాత్ర పూర్తయి సోమవారానికి నాలుగేళ్లు అయిన సందర్భంగా మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజన్న రాజ్యాన్ని తీసుకురావాలన్న సంకల్పంతో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో వైఎస్సార్ స్మారకవనం వద్ద 2017 నవంబర్ ఆరో తేదీన ప్రారంభమైన ప్రజా సంకల్పయాత్ర కోట్లాది మంది జనం మధ్య వారి హృదయాలను స్పృశిస్తూ 2019 జనవరి తొమ్మిదో తేదీన జిల్లాలోని ఇచ్ఛాపురంలో ముగిసిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. చంద్రబాబు నిరంతరం దూషిస్తున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా సంక్షేమ పథకాలకు కొనసాగిస్తున్నామన్నారు. చంద్రబాబు, అతని దత్తపుత్రుడు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్లా వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, నక్క కృష్ణమూర్తి, పైడి శ్రీనివాసరావు, మైలపల్లి కామరాజు, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, గొర్లె అప్పలనర్సునాయుడు ఉన్నారు.

ప్రజల కోసమే ప్రజా సంకల్పయాత్ర

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పేద ప్రజల కన్నీళ్లు తుడిచేందుకు, ఆకలితో అలమటించేవారికి అన్నం పెట్టేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేసి అందుకనుగుణంగా సంక్షేమ పథకాలు రూపొందించారని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఏడురోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రమంతా ప్రజా సమస్యలు తెలుసుకుని ఆ దిశగానే వైఎస్సార్ పాలించారని.. తండ్రి బాటలోనే ఇప్పుడు జగనన్న నడుచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి. స్వరూప్, డాక్టర్ శ్రీనివాసపట్నాయక్, ఎండ రమేష్, జెం.శ్రీనివాస్, టి.కామేశ్వరి, టంకాల బాలకృష్ణ, ఎం.ఎ.రఫీ, కింజరాపు రమేష్, ఖైరి మురళి, సీపాన రామారావు, గుడ్ల ధామోధరరావు, వానపల్లి రమేష్,భరద్వాజ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.



లావేరు: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మహోన్నత కార్యక్రమం

లావేరు: సీఎం జగన్‌మోహనరెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర మహోన్నత కార్యక్రమమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు అన్నారు. లింగాలవలసలోని పార్టీ కార్యాలయంలో ప్రజాసంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోవిందపురం పంచాయతీ మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, నాయకులు గొర్లె సూర్యనారాయణ, చందక నాగరాజు, దన్నాన రాంబాబు, లుకలాపు లక్ష్మణరావు, పతివాడ గురునాయుడు, బాబ్బాది భీమయ్య పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆనందపురంలో పారిశుద్ధ్య పనులు

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలో సర్పంచ్ చిత్తిరి మోహన్ పర్యవేక్షణలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రధాన రహదారిలో ఉన్న కాలువలో పూడికలు తొలగించారు.

అగ్ని నియంత్రణ పరికరాల అందజేత

రణస్థలం: పాఠశాలల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తక్షణమే నివారించేందుకు పలు పరికరాలు మండలానికి వచ్చాయని ఎంఈవో అల్లాడ త్రినాధరావు తెలిపారు. మండలంలోని తొలివిడతో మంజూరైన 34 నాడు–నేడు పాఠశాలలకు అగ్నిమాపక నివారణ పరికరాలను సోమవారం సిబ్బందికి అందజేశారు.పరికరాల వినియోగంపై పాఠశాల ఆఫీస్ సిబ్బందికి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ కోఆర్డినేటర్ విజయ్, సీఆర్‌పీలు పాపినాయుడు, పద్మావతి తదితరులు ఉన్నారు.

రాయితీపై ఎరువుల పంపిణీ

జి.సిగడాం: పాలఖండ్యాం రైతుభరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై ఎరువులను సోమవారం సరఫరా చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ పాగిరి నారాయణరావు, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాయపురెడ్డి సూర్యనారాయణ సమక్షంలో వీటిని అందించారు.

వెంకటాపురంలో మేలుకొలుపు

లావేరు: వెంకటాపురంలో సోమవారం మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో ఏటా ధనుర్మాసం ప్రారంభం నుంచి సంక్రాంతి వరకూ గ్రామస్తులు మేలుకొలుపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మేలుకొలుపులో సేకరించిన బియ్యం, నగదుతో సంక్రాంతి తరువాత గ్రామంలో అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.